నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | ఆదివారం 24 డిసెంబర్ 2023 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




గార్డెన్‌లో క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



అందమైన ఉదయం..

**అప్పడే ఉదయిస్తున్న** సూర్యుడు. పైన నల్లటి మబ్బులు.. మధ్యమధ్యన ఎరుపువర్ణం.. కింద పచ్చని పొలాలు.. దూరంగా ఉన్న కొండపై కమ్ముకున్న మంచుదుప్పటి.. ఈ దృశ్యం శనివారం పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామ సమీపంలోని బొక్కివాగు ప్రాజెక్టు వద్ద ఆవిష్కృతం కాగా, చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నది. *- పెంచికల్‌పేట్, డిసెంబర్ 23*

# క్రైస్తవుల సంక్షేమానికి కృషి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 23 : క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, క్రైస్తవ మత పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- మూడు నియోజకవర్గాలకు కానుకలు పంపిణీ

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 23 : క్రిస్మస్‌ను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్నామన్నారు. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు మూడు వేల కానుకలు సరఫరా చేసినట్లు చెప్పారు. అలాగే విందుకోసం నియోజక వర్గానికి రూ. 2 లక్షల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, అధికారులు, వివిధ చర్చిల పాస్టర్లు, క్రైస్తవ సోదరులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న మంచిర్యాల కలెక్టర్ సంతోష్

# టెంట్లేసి.. దోచేసి..

## పల్లెల్లో ప్రైవేట్ వ్యాపారుల పత్తి దందా

- నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు
- సీసీఐ నిర్ణయించిన ధర రూ. 7,100 కాదని.. రూ.6,500 మాత్రమే చెల్లింపు
- క్వింటాలుకు ఐదు నుంచి పది కిలోల చొప్పున కోత
- అక్రమంగా మహారాష్ట్రకు తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



కెరమెరి మండల కేంద్రంలో టెంట్ వేసిన పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

*పల్లెల్లో దళారులు పత్తి దందాకు తెరలేపారు. ప్రధాన కూడళ్లలో టెంట్లు వేసుకొని మరీ ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు చేపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి తాము చెప్పిందే ధర అన్నట్లుగా వ్యవహరిస్తూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. సీసీఐ క్వింటాలుకు రూ. 7,100 ధర పెడుతుంటే.. వ్యాపారులు మాత్రం రూ.6,500 మాత్రమే చెల్లిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.*

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 14 జిన్నింగ్‌లలో పత్తి కొనుగోళ్లు సాగుతున్నాయి. ఇక సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేని ఏజెన్సీ మండలాలైన లింగాపూర్, సిర్పూర్-యు, కెరమెరి, తిర్యాణిలలో దళారులు నేరుగా రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు సాగిస్తున్నారు. రెండు.. మూడు ఎకరాల్లో పత్తి పండించే రైతులు.. సీసీఐ కేంద్రాలకు తీసుకురాలేక తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇక ఇదే అదనుగా భావించి వారు ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు చేపడుతున్నారు. పల్లెల్లోని ప్రధాన చౌరస్తాల్లో టెంట్లు వేసుకొని మరీ దందా సాగిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 7,100 చెల్లిస్తుంటే.. వ్యాపారులు మాత్రం రూ. 6,500 మించి ఇవ్వడం లేదు. దీనికి తోడు క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల దాకా కోత విధిస్తున్నట్లు తెలుస్తున్నది.

### మహారాష్ట్రకు మన పత్తి..

మహారాష్ట్ర సరిహద్దులోని సిర్పూర్-టీ, కౌటాల, చింతలమానేపల్లి మండలాల నుంచి మహారాష్ట్రకు వెళ్లే దారుల్లో ఎలాంటి చెక్‌పోస్టులు లేకపోవడంతో వ్యాపారులకు కలిసి వస్తున్నది. పట్టాలు లేని రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మహారాష్ట్రకు తరలించి విక్రయిస్తున్నారు. దళారులు స్థానికులే ఉండడంతో వారిని నమ్ముకొని తాము పండించిన పంటను రైతులు వారి చేతిలో పెడుతున్నారు. పైగా మహారాష్ట్ర వ్యాపారులు వాహనాలతో పాటు అక్కడి నుంచే కూలీలను తీసుకొస్తుండడంతో రైతుల వారికి విక్రయించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతున్నది. జిల్లా నుంచి రోజుకు పదుల సంఖ్యలో పత్తి వాహనాలు తరలిపోతున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



పత్తిని వాహనంలోకి ఎక్కించిన వ్యాపారులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సంతోష్

# గెలుపోటములు సహజం

- విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో పోటీ పడాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్
- మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో మూడో వార్షిక స్పోర్ట్స్ మీట్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 23 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో పోటీపడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన మూడో వార్షిక స్పోర్స్ మీట్ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయ బృందం, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజీమార్గమే రాచమార్గం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 23 : రాజీమార్గమే రాచమార్గమని డీఎల్ఎస్ఏ సెక్రెటరీ యువరాజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్ మంచి వేదికన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రెటరీ యువరాజ ►





నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677




గోలేటి శ్రీ భీమన్న క్రీడమైదానంలో కేక్ కట్ చేస్తున్న సీనీనటుడు నాజర్, ఏరియా జీఎం రవిప్రసాద్



మందమర్రిలో స్టాళ్లను ప్రారంభిస్తున్న జీఎం మనోహర్ సవిత దంపతులు



శ్రీరాంపూర్ : జీఎం ఆఫీస్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

# అట్టహాసంగా ఆవిర్భావం

**సింగరేణి వ్యాప్తంగా** శనివారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా సాగాయి. గనులు, డిపార్ట్‌మెంట్‌లు, కార్యాలయాల్లో అధికారులు జెండాలు ఆవిష్కరించారు. కేక్‌లు కట్ చేసి.. మిఠాయిలు పంపిణీ చేశారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియం, మందమర్రి సింగరేణి పాఠశాల గ్రౌండ్, రెబ్బెనలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ఆయాచోట్ల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జీఎంలు సంజీవరెడ్డి, మనోహర్, రవిప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొని, తెలంగాణ ఆర్థిక ప్రగతిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తున్నదంటూ కొనియాడారు.

# వస్తువులు కొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్
- కలెక్టరేట్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 23 : వస్తువులు కొనేటప్పుడు వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మీటింగ్ హాలులో జిల్లా పౌరసరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏదైనా వస్తువు కొని మోసపోయిన, నష్టపోయినా సత్వర న్యాయం పొందేందుకు చట్టాన్ని వాడుకోవాలన్నారు. వినియోగదారుల హక్కులు కాపాడే విధంగా 2020లో సీసీపీఏ (సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ) స్థాపించడం జరిగిందని, దీని ద్వారా ఫిర్యాదు చేసిన 30 రోజుల్లోగా సంబంధిత కోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారుల కంప్లైంట్ మానిటరింగ్ కమిటీ ద్వారా ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందన్నారు. 2019 వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం వినియోగదారులకు ఆయుధంగా నిలిచిందని, అక్రమ లావాదేవీలను నిరోధిస్తుందన్నారు. అనంతరం వినియోగదారుల చట్టాల ప్రతులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గెడం గోపాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బీ శేషాద్రి, వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌కుంట, ప్రధాన కార్యదర్శి తౌటం చేతన సోనీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

# వైకల్యాన్ని జయించి అభ్యున్నతి సాధించాలి

- దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కమిటీలు
- జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి
- ఆసిఫాబాద్‌లో ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 23 : దివ్యాంగులు వైకల్యాన్ని జయించి అభ్యున్నతి సాధించాలని జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాత జిల్లా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి వచ్చే పది రోజుల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంపై డీడబ్ల్యూవో కార్యాలయం సిబ్బంది తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, అనర్హులకు మూడు చక్రాల సైకిల్ అందజేస్తున్నారని, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి ఫలితముండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదరమ్ క్యాంపుల్లో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సదరమ్ క్యాంపులు నిర్వహిస్తున్నా.. ఇక్కడ మాత్రం జరగడం లేదని తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి 60 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నా.. కేవలం మూడు శాఖలకు చెందిన అధికారులే వస్తున్నారని చెప్పారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మొదటి వారంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని, జిల్లా, మండల సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆ కమిటీలకు జిల్లా అధ్యక్షుడిగా కలెక్టర్ ఉండాలని కోరారు. జిల్లాలో 9,000 మంది సదరమ్ ధ్రువపత్రాలు కలిగి ఉన్నారని, అందులో 40 శాతం బోగస్ వికలాంగులున్నారని, వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, డీపీఎంలు అన్నాజీ, యశోద, పీడబ్ల్యూడీ హెల్ప్ లైన్ ఎఫ్ఆర్వో రవి పాల్గొన్నారు.



భవన నిర్మాణం గురించి తెలుసుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులు

# న్యాయస్థాన భవన నిర్మాణం పరిశీలన

బెల్లంపల్లిరూరల్, డిసెంబర్ 23 : కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న బెల్లంపల్లి న్యాయస్థాన భవన సముదాయాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. అలాగే జడ్జి గృహ నిర్మాణాన్ని కూడా పరిశీలించారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి జే.ముఖేష్‌ను పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మ్యాపులను చూసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ పీ.సదయ్య, బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ బన్సీలాల్, బెల్లంపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.



గంగాపూర్‌లో పూజలు చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మందమర్రి : శ్రీవేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# 'ముక్కోటి' వైభవం

- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఘనంగా ఏకాదశి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు
- పలుచోట్ల ప్రముఖుల పూజలు

**కుమ్రం భీం ఆసిఫాబాద్,** మంచిర్యాల జిల్లాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి. ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు ఉదయం నుంచే పోటెత్తగా, ఆలయాలు కిటకిటలాడాయి. గోవింద నామస్మరణతో పరిసరాలు మారుమోగాయి. స్వామి వారికి అభిషేకాలు, పల్లకీసేవ, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.